క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుకు 14 దరఖాస్తులు



మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి: మండలంలోని కొండూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మ్యుటేషన్‌కు 3, కుల ధ్రువీకరణ పత్రం మంజూరుకు రెండు, ఆదాయ ధ్రువీకరణ పత్రానికి రెండు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు రెండు, 1బి కోసం ఒకటి, పట్టాదారు పాసుపుస్తకం కోసం 4 చొప్పున దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. గ్రామ సర్పంచ్ సిద్ధార్థ, రెవెన్యూ, అటవి, దేవాదయ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకుడు

పావగడ: నాగల మడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగానే శుక్రవారం అంకురార్పణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ విశేష పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు రొద్దం సురేంద్రబాబు, నాగరాజు, భాస్కర్ నేతృత్వంలో అంకురార్పణ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మడకశిర: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఈయూ నాయకులు డీఎం రామసుబ్బయ్యకు వినతి పత్రం అందించారు. ఈయూ డిపో అధ్యక్షుడు రఫిక్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు వినతిపత్రం అందించారు. ప్రధానంగా శ్రీశైలం సర్వీసుకు మూడు రోజుల మస్టర్ ఇవ్వాలని, లేకపోతే ఈబస్సు సర్వీసు మడకశిర డిపోకు వద్దన్నారు. లేకపోతే డ్యూటీ చార్ట్‌ను బహిష్కరిస్తామన్నారు. సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని డీఎం హామీ ఇచ్చినట్లు ఈయూ డిపో అధ్యక్షుడు రఫిక్ తెలిపారు.

నూతన ఆర్టీసీ బస్సుల ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ అధికారులు

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో శుక్రవారం రెండు నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించారు. మడకశిర నుంచి శ్రీశైలానికి ఈ సర్వీసులను నడపనున్నారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, డీపీటీఓ మధుసూదన్, ఆర్టీసీ డీఎం రామసుబ్బయ్య, ఇతర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

షరీఫ్ కథలు .. శ్రామిక జీవుల వ్యథలు



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న కవులు, పట్టణ వాసులు

పెనుకొండ: వేంపల్లె షరీఫ్ కథలు శ్రామిక జీవుల వ్యథలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని ఖమ్రుద్దీన్ ఆలి ట్రస్ట్ కార్యలయంలో వేంపల్లి షరీఫ్ రచించిన చారలపిల్లి కథల పుస్తక పరిచయ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. రచయిత షరీఫ్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ఊరు, ఈ ప్రాంత ప్రజలు, భాష , చుట్టూ ఉన్న పరిస్థితులే కవితలు రాయడానికి ప్రేరణ అన్నారు. కార్యక్రమంలో యోగా గురువు రవిశంకర్, కోగిర జయచంద్ర, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఖలీయుల్లా, ఎంఎస్. మూర్తి, జాన్ ప్రియనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పేపర్లు పంపిణీ

హిందూపురం: మోడల్ పేపర్లు విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు సిద్ధం కావడానికి దోహదపడతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ ప్రెసిడెంట్ ఎల్ అనీల్‌కుమార్ అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో హిందూపురం మండలం సంతేబిదనూర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు.


- ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల మూతతో సులభంగా రవాణా
- విచ్చలవిడిగా కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణా
- గత ప్రభుత్వంలో అక్రమ తరలింపునకు అడ్డుకట్ట
- పట్టించుకోని కూటమి సర్కార్
- అక్రమార్కులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు



పెన్నా, జయమంగళి నదుల్లో అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

యథేచ్ఛగా దాటించేస్తున్నారు!

పరిగి: ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు మూతపడడంతో విచ్చలవిడిగా కర్ణాటకకు మద్యం, ఇసుక అక్రమంగా రవాణా అవుతోంది. అక్రమ మద్యం, ఇసుక రవాణాను కట్టడి చేయడానికి అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి మండలం, గ్రామాల్లో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. నాణ్యమైన మద్యం అందించాలన్న లక్ష్యంతో దశలవారీగా మద్యపాన నిషేధాన్ని అమలు చేశారు. దీంతో పాటు అప్పట్లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నదులు, కాలువల్లో నీటి పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక విచ్చలవిడిగా తోడేసి భావితరాలకు ఇసుక కనుమరుగయ్యే స్థితి దాపురించింది.



మూతపడిన హొన్నంపల్లి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు



నిరుపయోగంగా ఉన్న శ్రీరంగరాజుపల్లి చెక్‌పోస్టు

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులతో సత్ఫలితాలు..

గత ప్రభుత్వ హయాంలో సరిహద్దు ప్రాంతాల్లో జీపీఎస్ ఆధారంగా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఒక్కో చెక్‌పోస్టు నిర్మాణానికి దాదాపు రూ. 2.20 లక్షలను వెచ్చించారు. ఇందులో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేయించారు. బార్డర్‌కు ఆనుకుని ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. దీనికి తోడు నది పరీవాహక ప్రాంతంలో ఉన్న అక్రమ రోడ్ల వెంబడి గుంతలు తవ్వించి, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేశారు. వీటి నిర్వహణకు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లను నియమించి యువతకు ఉద్యోగావకాశాలను కల్పించారు. ఒక్కో చెక్‌పోస్టుకు ఇద్దరేసి ఎస్పీఓలను నియమించి, కర్ణాటక మద్యం, ఇసుక, కలప తదితర అక్రమ రవాణాను అరికట్టడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సఫలమైనట్లు ప్రజలు విశ్వసించారు.

నీరుగారుస్తున్న కూటమి సర్కారు..

కర్ణాటక మద్యం, ఇసుక అక్రమార్కులకు కూటమి సర్కారు అండగా నిలుస్తోందని ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో కట్టడి చేసిన ఇసుక, కర్ణాటక మద్యం అక్రమ రవాణా లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్న విమర్శలు ఉన్నాయి. ఏపీలో నాణ్యమైన మద్యం అందించడంతో పాటు రూ.99కే మద్యం ఇస్తామని చెప్పిన వాగ్దానాలు నెరవేరకపోవడంపై ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా విచ్చలవిడిగా బెల్టు షాపులు, యథేచ్ఛగా కర్ణాటక మద్యం రవాణా, విక్రయాలు సాగుతున్నా అరికట్టడంలో అధికార యంత్రాంగం పట్టించుకోలేదన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. దీనికి తోడు కర్ణాటకలో చీప్ లిక్కర్ రూ.40కే దొరుకుతుండటంతో సామాన్యులు మద్యం కోసం కర్ణాటక ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో పాటు అక్కడి నుంచి ఇంటికి తెచ్చుకుంటున్నారు. గతంలో ఇసుక, మద్యం అక్రమ రవాణాను కేవలం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ద్వారా అరికట్టబడేది. ప్రస్తుతం పోలీసులకు ఇది పనిభారాన్ని మరింతగా పెంచింది. దీంతో నామమాత్రంగా చుట్టపుచూపుగా దాడులు నిర్వహిస్తున్నారు.

కర్ణాటక మద్యం తరలింపును అరికట్టాలి

కర్ణాటకలో చీప్ లిక్కర్ ధర తక్కువ ధరకే లభిస్తుండటంతో ఆంధ్ర ప్రాంతం నుంచి మద్యం బాబులు వెళ్తుంటారు. అక్కడి నుంచి కొందరు అక్రమార్కులు విచ్చలవిడిగా కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లను తీసుకొచ్చి, ఆంధ్ర గ్రామీణ ప్రాంతాల్లో అమ్ముతున్నారు. మా గ్రామానికి కర్ణాటక ప్రాంతం సరిహద్దుగా అక్కంపల్లి, గుమ్మగట్ట, దొమ్మతమర్రి ఉన్నాయి. అక్కడి నుంచి నిత్యం కర్ణాటక మద్యం తరలివస్తోంది. కొత్తపల్లి, పైడేటి వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. దీంతో అడ్డుకునే అధికారులు లేకపోవడంతోనే అక్రమ రవాణాదారులు పేట్రేగిపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ రవాణాపై దృష్టిసారించి అరికట్టాలని కోరుతున్నాం.

– అరుణ్‌రెడ్డి, నరసాపురం, పరిగి మండలం

31 వరకూ పోలీస్ యాక్ట్

పెనుకొండ: పట్టణంలో ఈ నెల 31 వరకూ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు నిర్వహించకూడదన్నారు. ఒకవేళ ఏదైనా కార్యక్రమం చేయాలనుకున్నా డీఎస్పీ అనుమతి తీసుకోవాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవన్నారు.

యువతి అదృశ్యం

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో చాందిని (24) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. శ్రీరంగరాజుపల్లికి చెందిన అంజినప్ప కుమార్తె చాందినీ హిందూపురంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తోందన్నారు. గత నెల 30న ఇంటి నుంచి బయటకు వచ్చిన చాందిని తిరిగి ఇంటికి వెళ్లలేదని పేర్కొన్నారు. శుక్రవారం చాందినీ తండ్రి అంజినప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

5న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ

పెనుకొండ: అనంతపురం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియంలో 5వ తేదీన రాయలసీమ విద్యావంతుల వేదిక సభా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వంద సంవత్సరాల చరిత్రలో వంచనకు గురైన రాయలసీమ వ్యథలను సభలో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి మేధావులు, ప్రజలు, విద్యావంతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సైన్స్‌ఫేర్‌లో ఎంజేపీ విద్యార్థి ప్రతిభ



షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రామ్‌చరణ్

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీలో ఏడో తరగతి చదువుతున్న రామ్‌చరణ్ జిల్లా సైన్స్‌ఫేర్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అనితారెడ్డి తెలిపారు. ఆమ్లాలు, క్షారాలు, లవణాలు అనే అంశంలో ప్రతిభా చూపి జిల్లా స్థాయిలో మూడో బహుమతి దక్కించుకున్నట్లు చెప్పారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన

పెనుకొండ: పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయం వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, పట్టణ జనాభా మేరకు కార్మికుల సంఖ్యను పెంచాలని, గత 17 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇవ్వడానికి అధికారులు ఎవరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందించారు. నాయకులు జిల్లా కార్యదర్శి రమేష్, కార్మికులు చినవెంకటేష్, నరసింహులు, ప్రసాద్, భాస్కర్, సూరి, లక్ష్మీదేవి, సరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: కార్మిక చట్టాల ప్రకారం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నేరవేర్చాలని సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆఫీసు వద్ద కార్మికులు ర్యాలీగా తరలివచ్చి ధర్నా చేపట్టి కమిషనర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఆ సంఘం కార్యదర్శి జగదీష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ: అధికారులు లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజలకు ఏం మేలు చేశారు?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిరరూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఆర్భాలాలు తప్ప ప్రజలకు చేసిందేమీలేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలకు ఏమి మేలు చేశారని రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల ఇచ్చిన అర్జీలకు పరిష్కార చూపాలేకపోతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి నాయకుల మాటలను విని పోలీసులు అమాయక ప్రజలను వేధిస్తున్నారన్నారు. కక్షసాధింపు రాజకీయాలు మానుకుని ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు. రైతుల ఖాతాలోకి పెట్టుబడి సాయం జమ చేయకపోవడంతో రైతులు అప్పులు చేసి రబీ పంటలను సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలుపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



రొద్దంలో యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రొద్దం: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈఓ-2 విజయభాస్కర్ చేతులమీదుగా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో యూటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శి మారుతి పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, కవిత, లత, హసీనా, కృష్ణానాయక్, ఉపేంద్ర, రమేష్, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

లేపాక్షి: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్య పరీక్షలకు విచ్చేసిన గర్భిణులకు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇప్పటి వరకూ 3,600 మంది గర్భిణులకు అన్నదానం చేసామని, ప్రతి వారం యథావిధిగా అన్నదానం చేస్తున్నట్లు రామానందన్ తెలిపారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి సచివాలయం ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు సర్పంచ్ చినరంగప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి హాజరయ్యారు. ఉజ్జినీపురానికి చెందిన సరోజమ్మకు రూ.25 వేలు చెక్కును పంట సాగు కోసం పెట్టుబడి సాయం కింద ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి అందజేశారు.

కిశోర వికాసంతో ఉజ్వల భవిత

అగళి: కిశోర వికాసంతో బాలికలకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని సీడీపీఓ నాగమల్లీశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాగమల్లీశ్వరి మాట్లాడుతూ కిశోర వికాసం అనేది నిరంతర ప్రక్రియన్నారు. బాల్యవివాహాలు, లైంగిక హింస, టీనేజ్ ప్రెగ్నెన్సీ లాంటి సమస్యలను బాలికలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కిశోర వికాస గ్రూపులను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ యాదవేంద్ర, ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని సీడీపీఓ శాంతలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల కళాశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు మండల స్థాయి, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీఓ గంగాధర్, అంగనవాడీ సిబ్బంది, మహిళా పోలీస్ దేవీబాయ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల స్థాయి అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆడపిల్లలను కాపాడండి, ఆడపిల్లను చదివించండి అనే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజలోకి తీసుకెళ్లే బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు అధికారులపై ఉందని ఎంపీపీ ప్రమీల పేర్కొన్నారు.



అగళి: మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లీశ్వరి ,



గోరంట్ల: శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

సంక్షిప్త సమాచారం

కూటమి నాయకుల మాటలు నమ్మొద్దు

రొళ్ల: మండలంలోని కాకి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నుంచి గురువారం వంద కుటుంబాలు పార్టీని వీడి టీడీపీలో చేరాయని కూటమి నాయకులు చెప్పడం హాస్యాస్పదమని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, వైస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి అన్నారు. ఒకరిద్దరు మాత్రమే పార్టీని వీడినంత మాత్రన పార్టీకి నష్టమేమీలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చెందిన మాజీ సర్పంచులు, వారి అనుచరులు టీడీపీలో చేరారే తప్ప వైఎస్సార్‌సీపీ కేడర్ ఎక్కడికి పోలేదని గుర్తు చేశారు. కూటమి నాయకులు చెప్పే మాయ మాటలు ప్రజలు నమ్మొద్దన్నారు.

ఎంఈఎఫ్ డైరీ ఆవిష్కరణ

మడకశిర: పట్టణంలో శుక్రవారం ఎంఈఎఫ్ (మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్) డైరీ, క్యాలెండర్లను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పలు సమస్యలను పరిష్కరించాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఎంఈఎఫ్ నాయకులు భూతన్న, రంగస్వామి, శివన్న, మాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

హిందూపురం అర్బన్: మండలంలోని మనేసముద్రం సమీపంలో బ్రిడ్జి కింద అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ (21) మృతి చెందాడు. శుక్రవారం బ్రిడ్జి సమీపంలో దుర్వాసన వస్తుండటంతో గమనించిన గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతదేహన్ని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడు మూర్ఛవ్యాధితో బాధపడుతున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

కృష్ణజింక వైద్యం కోసం తరలింపు



కృష్ణజింకను తరలిస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని కాగానిపల్లి సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద శుక్రవారం కదల లేని స్థిలో ఉన్న కృష్ణ జింకను రైతులు గుర్తించి అటవీసిబ్బందికి సమాచారమిచ్చారు. అటవీ సిబ్బంది ఘటనాస్థలానికి వచ్చి కృష్ణ జింకను చికిత్స నిమిత్తం పుట్టపర్తిలోని కరుణ సొసైటీకి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి వద్ద మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుళ్లసముద్రం గ్రామానికి చెందిన డీఎన్ క్రిష్టప్ప (32) బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని మాజీ సర్పంచ్ జయపాల్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

త్వరలోనే తుంగభద్ర నీరు విడుదల

పావగడ: త్వరలోనే తుంగభద్ర జలాలను తాలూకవాసులకు అందిస్తామని ఎమ్మెల్యే వెంకటేశ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థుల ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 న ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. అలాగే పేద ప్రజల ఇళ్ల నిర్మాణానికి 183 ఎకరాల భూమిని గుర్తించామన్నారు.

చేతిపంపు తొలగింపుపై 100కు ఫిర్యాదు

పెనుకొండ రూరల్: చేతిపంపును తొలగించడంతో గ్రామస్తులు డయల్ 100కి ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలోని శెట్టిపల్లిలోని శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలోని మారెమ్మదిన్నె వద్ద గతంలో అధికారులు చేతిపంపును ఏర్పాటు చేశారు. శుక్రవారం తొలగించడంతో గ్రామస్తుడు జగన్‌మోహన్‌రెడ్డి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెంటనే పంచాయతీ అధికారులతో చర్చించారు. అయితే మరమత్తుల కోసమే ఆర్‌డబ్ల్యూస్ సిబ్బంది తొలగించినట్లు, తిరిగి అమరుస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ తెలిపారు.



హిందూపురం: బీఎస్పీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



గుడిబండ: ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదర్శ మూర్తి సావిత్రిబాయి పూలే

విద్యలో అగ్రగామిగా నిలిచి మహిళలందరికీ ఆదర్శమూర్తిగా సావిత్రిబాయి పూలే నిలిచారని వక్తలు కొనియాడారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను స్మరించుకున్నారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మి, బాలికా విద్య ఉద్యమానికి పునాది వేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే కొనియాడారు.

సాక్షిబృందం:



హిందూపురం: మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



మడకశిర మండలం రేకులకుంట పాఠశాలలో ఉపాధ్యాయినీలను సన్మానించిన దృశ్యం



మడకశిర: సావిత్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు